క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



నెక్కొండ : విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రెడ్ల వాడ గ్రామ రైతులు సంగి వెంకన్న, కాముని శ్రీనివాస్, తొగరు అల్లూరు, ఎడమ రమేష్, ఐలయ్య పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను పట్టుకుని శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పంట పొలాలకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల కాలిపోయిందని వారు చెప్పారు. వేలాడుతున్న తీగలను సరిచేయడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నల్లబెల్లి : షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పంటుకుని ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని నాగరాజుపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాగరాజుపల్లికి చెందిన పోలోజు మొగిలి వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు లేచాయి. వడ్రంగి పనికి ఉపయోగించే విద్యుత్ మోటార్, ఇంట్లో నిల్వ చేసిన కలప, ద్విచక్ర వాహనంతోపాటు ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు ఘటనా స్థలిని సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.2.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు మొగిలి తెలిపారు. సర్పంచ్ గొనే శ్రీదేవి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చికిత్స పొందుతున్న తాపీ మేస్త్రీ మృతి



సుమన్ (ఫైల్)

సంగెం : మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ఇసంపెల్లి సుమన్ (33) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. సుమన్ ఈనెల 13న కిందపడి గాయాల పాలయ్యాడు. మృతుడికి భార్య, తల్లి, ఇద్దరు కూతుర్లున్నారు. సుమన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె..

రాయపర్తి : విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని బాల్‌నాయక్‌తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు భూక్య వెంకన్నకు చెందిన పాడి గేదె పొలంలో మేత మేస్తుండగా పక్కనే ఉన్న ఎల్‌టీ లైన్‌కు చెందిన వైరు తెగి గేదె మీద పడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది.

పలువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట : వ్యక్తిగతంగా దూషించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కందిగడ్డ తండాకు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేపట్టిన 'హాత్‌సే హాత్ జోడో' యాత్రకు వస్తుండగా తండాకు చెందిన పాండ్య వెంకన్న 'మా తండాకు ఏం చేస్తున్నావు' అంటూ ప్రశ్నించడంతో కాంగ్రెస్ నాయకులు సిద్దన రమేశ్‌తోపాటు పలువురు కులం పేరుతో దూషించారని శుక్రవారం ఫిర్యాదు చేశాడని చెప్పారు. పలువురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

చెన్నారావుపేట : వర్షపు నీటిని ఒడిసి పట్టాలని ఎంపీఓ శ్రీధర్‌రాజ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వరంగల్‌కు చెందిన నెహ్రూ కేంద్రీయ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'క్యాచ్ ద రెయిన్' అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షపు నీటిని ఆదా చేయడానికి ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, చెరువు పూడిక తీయాలని, చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులపై వివక్ష

చెన్నారావుపేట : ప్రభుత్వం గీత కార్మికులపై వివక్ష చూపుతోందని మోకు దెబ్బ జిల్లా యూత్ అధ్యక్షుడు కళ్లెపు గణేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కులాల నడుమ చిచ్చు పెట్టేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. వెంటనే గీత కార్మికులకు గౌడబంధు పేరుత రూ.10 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సర్టిఫికెట్ల కోసం ప్రదక్షిణలు

- సర్వర్ డౌన్.. మొరాయిస్తున్న 'మీసేవ'

నర్సంపేట రూరల్ : విద్యార్థులు ఉన్నత విద్య, బీసీలు లక్ష రుణం కోసం మీసేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలోనే సర్వర్ డౌన్ అవుతుండడంతో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు రేపు.. మాపు.. అంటూ దాటవేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నర్సంపేట పట్టణంలో 24 వార్డులు, మండలంలో 27 గ్రామపంచాయతీలున్నాయి. వేలాది మంది విద్యార్థులు, బీసీలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేస్తున్నారు. కాగా విద్యార్థులు కళాశాలలో చేరేందుకు, బీసీలు రుణం కోసం దరఖాస్తు చేసేందుకు గడువు సమీపిస్తుండడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంటోంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో దరఖాస్తులు మీసేవ కేంద్రాలకు వస్తుండడంతో సర్వర్ డౌన్ అవుతోంది. అధికారులు రేపు.. మాపు.. అంటూ కాలయాపన చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలోని మీసేవ కేంద్రం వద్ద గుమిగూడిన ప్రజలు

కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందించాలి



దరఖాస్తు చేసి ఐదు రోజులు గడిచాయి. కుల, ఆదాయ సర్టిఫికెట్లు త్వరగా అందించాలి. మీసేవ కేంద్రంలో ఎప్పుడు అడిగినా సర్వర్ డౌన్ అయ్యిందంటున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. జాప్యాన్ని నివారించే దిశగా చర్యలు చేపట్టాలి. దరఖాస్తుదారులకు సకాలంలో సర్టిఫికెట్లు అందేలా చూడాలి. గడువు ముగిస్తే విద్యార్థులు, బీసీలు నష్టపోయే ప్రమాదం ఉంది.

-బండ వెంకటేశ్వర్లు, నాగుర్లపల్లి వాసి

ప్రదక్షిణలు తప్పడం లేదు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న సమయంలోనే ప్రభుత్వం బీసీలకు లక్ష రూపాయల రుణం ఇచ్చేందుకు గడువు నిర్ణయించడంతో వారూ దరఖాస్తు చేయడానికి వస్తుండడంతో సర్వర్ డౌన్ అవుతున్నట్టు తెలుస్తోంది. తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

-కొత్తకొండ రాజమౌళి, మాదన్నపేట

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శీలం సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డుల నుంచి మాసు కుమార్, నాగరాజు, ఆనంద్, భిక్షపతి, గట్టయ్య సమక్షంలో సుమారు వంద కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్ శీలం రాంబాబు, పట్టణ కార్యదర్శి వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, వార్డు కమిటీ అధ్యక్షుడు సంపంగి సాలయ్య, నాయకులు బక్కయ్య, యాకూబ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మహిళల ఉపాధికి బీఆర్‌ఎస్ ప్రాధాన్యం



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉపాధి కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ తెలిపారు. మండలంలోని కాట్రపల్లి, సన్నూరు గ్రామాల్లో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం వారు కుట్టుమిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బోనగిరి ఎల్లయ్య, నలమాస సారయ్య, ఉపసర్పంచ్ రేణుక, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉందాటి సతీశ్, ఎంపీటీసీలు బిజ్జాల సంధ్య సోమన్న, గోవింద్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కొమురుమల్లు, సీసీ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న జిలుకర రవికుమార్

రాయపర్తి: బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో దొరల పాలనను అంతం చేసే దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుముల రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సోమారపు అరవింద్, ప్రధాన కార్యదర్శిగా చెడుపాక ప్రశాంత్, కోశాధికారిగా వంగాల కుమార్, బీవీఎఫ్ కన్వీనర్‌గా మాదారపు గణేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కొమ్ము భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు సీర్మాల రత్నం, చిలుముల కృష్ణ, పడమటింటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



వర్ధన్నపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ (ఏజీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీలోని రిసోర్స్‌పర్సన్లకు (ఆర్పీ) ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



వర్ధన్నపేట : మండలంలోని చెన్నారంలో యాదవ కులస్తులు శుక్రవారం మధునమ్మ మహంకాళి అమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు కురవాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కులపెద్దలు మంద ధర్మయ్య, సారంగం, అశోక్, సంజీవ, యాదవులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి

- కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు

సంగెం : టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులకు వంద గజాల చొప్పున ఇంటి స్థలంతోపాటు ఇంటికో ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూనే రైతులకు రుణమాఫీ చేయడంలో బీఆర్‌ఎస్ విఫలమైందన్నారు. ధాన్యంలో భారీగా కోత పెడుతున్నారని, ధాన్యం విక్రయించి నెలరోజులు గడచినా రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రైతుల వద్ద రూ.10 లక్షలకు కొనుగోలు చేసి కంపెనీలకు కోట్లాది రూపాయలకు అమ్ముకోవడానికి, మట్టి దందా కోసమే అన్నారు. నిర్వాసిత రైతుల పక్షాన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు విలాసాగరం వెంకటేశ్వర్లు, బాదావత్ నర్సింహనాయక్, పులి సాంబయ్య, గుల్లపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొంపల్లి దేవేందర్‌రావు

సమాచారం ఇవ్వట్లే.. ఆర్డీఓకు ఫిర్యాదు

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ శివారులోని రావికుంట చెరువు శిఖం భూమికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసి 55 రోజులు గడచినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదంటూ ఆర్డీఓ శ్రీనివాసులుకు సహ చట్టం జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి తెలిపారు. అనంతరం కుమారస్వామి విలేకరులతో మాట్లాడారు. గత నెల రావికుంట చెరువు శిఖం, కొత్త పట్టాలు, ఆయకట్టు లోతు, తదితర వివరాలు ఇవ్వాలని నాటి తహసీల్దార్ బన్సీలాల్‌ను కోరినట్లు తెలిపారు. ఇప్పటివరకు సమాచారం ఇవ్వకపోవంతో ఆర్డీఓకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. ఆర్డీఓ స్పందించారని, సమాచారం ఇవ్వాలంటూ ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధుసూదన్‌ను లిఖిత పూర్వకంగా ఆదేశించారని చెప్పారు. కాగా దశాబ్ది ఉత్సవాల్లో బిజీగా ఉన్న క్రమంలో ఈనెల 27 వరకు సమయం ఇవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధుసూదన్ కోరినట్టు కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పూర్ణకుమార్, వీరెందర్, కూస సుదర్శన్, జాటోతు యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న సహ చట్టం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి

స్థలం ఇచ్చి 'డబుల్' ఇళ్లు కట్టించాలి



మాట్లాడుతున్న ఇస్మాయిల్

సంగెం : టెక్స్‌టైల్ పార్కుకు భూమి ఇచ్చిన రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే వంద గజాలు చొప్పున స్థలం ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టించాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుంటపల్లిలో ఆయన ఆధ్వర్యంలోని బృందం భూనిర్వాసిత రైతులను కలిసి సమస్యలపై అధ్యయనం చేసింది. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. రైతుల భూములు తీసుకుని ఉద్యోగాలు కల్పించలేదన్నారు. స్థానిక నిరుద్యోగుల ఆశలు తీరలేదన్నారు. హామి నేరవేర్చకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోనె రాంచందర్, శివ కుమారస్వామి, రౌతు శ్రీనివాస్, శివారెడ్డి, జక్క రాములు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య విగ్రహ ఏర్పాటుకు మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉందాటి సతీశ్, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్, గుంశావలీ, సర్పంచ్ చెడుపాక కుమారస్వామి, అనిరెడ్డి యాకూబ్‌రెడ్డి, కన్నెకంటి శ్రీనివాస్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నాగపురి సోమన్న, నాగపురి అశోక్, చేగూరి మల్లేష్, సాయి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు ప్రత్యేక పోస్టల్ పథకం

దుగ్గొండి : పోస్టల్ శాఖ మహిళలు, బాలికల కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోందని వరంగల్ సౌత్ సబ్ డివిజన్ పోస్టల్ ఆఫీసర్ సుమన్ గౌడ్ తెలిపారు. మండలంలోని మహ్మదాపురంలో శుక్రవారం నిర్వహించిన పోస్టల్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలికలు కనిష్ఠంగా రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షలు వరకు జమ చేసుకోవచ్చని తెలిపారు. పొదుపుపై నెలకు 7.5 శాతం వడ్డీ లభిస్తుందని చెప్పారు. పథకంలో చేరిన మహిళలు, బాలికలు మృతి చెందినా, అనారోగ్యం బారిన పడ్డా ప్రయోజనాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం కరుణాకర్, బీపీఎంలు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరి, శ్రావణ్, కమ్రుద్దీన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయండి

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో అదనపు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ మోడెం విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన మంత్రి సత్యవతి రాథోడ్‌ను మహబూబాబాద్‌లోని ఆమె క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యను మంత్రికి వివరించారు. గ్రామంలో అధిక జనాభా ఉన్నట్టు చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్లు రెండు మాత్రమే ఉన్నాయన్నారు. అదనంగా మరొకటి మంజూరు చేయాలని, అంగన్‌వాడీ సెంటర్లకు భవనాలు, సౌకర్యాల కోసం నిధులు కేటాయించాలని కోరారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ విద్యాసాగర్

'గౌడ కులస్తులకు అవకాశం హర్షణీయం'

నర్సంపేట : బీసీ రుణ పథకంలో బీసీ కులవృత్తిదారులకు అవకాశం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేశ్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని పాపన్న గౌడ్ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. బీసీ కులవృత్తులలో లక్ష రూపాయల రుణం కోసం మొదట గౌడ కులస్తులకు అవకాశం కల్పించకపోవడంతో మోకు దెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందజేసినట్టు తెలిపారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 5 జారీ చేస్తూ గౌడ కులస్తులు దరఖాస్తు చేసే అవకాశం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సొల్తి సారయ్య, గంప రాజేశ్వర్, రామగోని సుధాకర్, కందుల శ్రీనివాస్, మద్దెల సాంబయ్య, జూలూరి హరిప్రసాద్, సొల్తి సాంబయ్య, జూలూరి నరేశ్‌కుమార్, చుక్క అనిల్, తాళ్లపెల్లి రాజేశ్, మధు, రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతుల రమేశ్ గౌడ్

'కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం'

గీసుకొండ : మంత్రి కేటీఆర్ కేఎంటీపీలో తలపెట్టిన యంగ్‌వన్ కంపెనీ శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు వంద గజాల స్థలం ఇవ్వలేదని విమర్శించారు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మాట మార్చారని తెలిపారు. పార్కు పనులకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అక్రమంగా మొరం తరలిస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కొమురారెడ్డి, నాగారపు స్వామి, ఆకుల రుద్రప్రసాద్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

రుణ దరఖాస్తు గడువు పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేట రూరల్ : లక్ష రూపాయల రుణం కోసం బీసీలు దరఖాస్తు చేసేందుకు విధించిన గడువును పొడిగించాలని ఎంసీపీఐ (యూ) మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రుణం కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉండడంతో వాటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. సర్వర్ డౌన్ అవుతుండడంతో ధ్రువీకరణ పత్రాల జారీలో మరింత జాప్యం అవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో దళారులు దరఖాస్తుదారుల నుంచి రూ.300–500లు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి దరఖాస్తు గడువు పొడిగించాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం బీసీలకు రుణాలిచ్చేందుకు నిర్ణయించిన క్రమంలో పేదలు దరఖాస్తు చేయడానికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో అర్హులకు అన్యాయం జరగకుండా గడువు పొడిగించాలని ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న బాల్నె జగన్

నర్సంపేట : బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్టు తప్పుడు ప్రచారం, ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శీలం సత్యనారాయణకు బీజేపీతో సంబంధం లేదన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడపడం బీఆర్‌ఎస్ పార్టీకే చెల్లుతోందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని చెప్పారు. బీజేపీ శ్రేణులు చేరినట్టు ప్రచారం తగదన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఐఎస్‌ఓ సర్టిఫికెట్ ప్రదానం



గీసుకొండ : మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందిన మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి, పంచాయతీ కార్యదర్శి నల్లెల్ల స్వప్నకు మంత్రులు దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా సర్టిఫికెట్ అందించి అభినందించారు. పౌరసేవలు సమర్థంగా అందించడం, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ఈ–పంచాయతీ సర్వీసుల అమలు సక్రమంగా చేపట్టిన వారికి ఈ సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు.